ఇద్దరిలో యెవరో ఒక
...దా నేను పోలీసు

# చీ క టి

భోజనాలయ్యాయి. రామచంద్రమూర్తి చెయ్యి తుడుచుకుంటూ, వరాండాలోకివచ్చి కుర్చీలో కూచుని, పేపరు చదవడం ఆరంభించాడు. నాలుగు నిమిషాలలో సీతకూడా, వంటయింటి తలుపులువేసుకొని. తమలపాకులూ, వక్కపొడి సీసా, సున్నపు సీసా తీసుకొనివచ్చి మూర్తిపక్కన కుర్చీలో కూచుంది. మూర్తి ఆమెవంక వకసారిచూసి, మళ్ళీ పేపరుచదువులోలీనమయ్యాడు.

సీత వక్కపొడి అందించింది. మూర్తి అందుకొని నోట్లో వేసుకున్నాడు. సీత, సున్నంరాసిన తమలపాకు చిలకను అందించింది. మూర్తి తలత్రిప్పి చూడకుండానే, చేత్తో చిలకను తీసుకొని నోట్లో వేసుకున్నాడు.

"అంత దీక్షగా చదువుతున్నారు, ఏమిటది" అని అడిగింది సీత.

"ఏదో, నీకర్థంకాదు." అని తలత్రిప్పి చూడకుండానే జవాబు చెప్పాడు మూర్తి. "అక్కరలేని గొడవలు నాకెందుకు గాని, యివ్వాళ కూడా వెళ్ళరు కాదేమండీ!" అంది సీత.

"ఎక్కడికి ?" అని అడిగాడు, మూర్తి.

"ఎక్కడికా! రోజూ చెప్పాలికాబోసు. చెప్పి, చెప్పి నా గొంతుకి నొప్పివస్తోంది కూడాను. ఉన్న రెండుచీరెలూ చిరిగిపోయాయి. ఎవరు వచ్చినా, ఎదటబడడానికి సిగ్గేస్తోంది. ఇరవైరోజులనుంచి చెబుతువున్నాను. పోనీ, షాపుకి వెళ్ళడానికి మీకు తీరకపోతే, ఆ డబ్బేదో నాకిస్తే నేనే వెళ్ళి తెచ్చుకుంటాను. ఎన్నాళ్ళు యీ చింకిగుడ్డలతో గడపనూ..." అంటూ, మరొక చిలకను అందించింది సీత. జవాబు చెప్పకుండా, ఆ చిలకను నోట్లో వేసుకున్నాడు మూర్తి.

"మాట్లాడరేమండీ! మీకు కావలసిన సూట్లూ, బూట్లూ మాత్రం నిమిషంలో అమర్చుకుంటారుగదా—" అని సీత కొంచెం జాలి మొహం పెట్టింది.